నీటి తడి ఏదీ..?

తాడిపత్రి సబ్‌డివిజన్‌కు అందని సాగునీరు

- దెబ్బతిన్న హెచ్చెల్సీ, డిస్ట్రిబ్యూటరీలు
- నిర్లక్ష్యంగా వదిలేసిన గత ప్రభుత్వం
- మరమ్మతులకు రూ.7 కోట్లతో ప్రతిపాదనలు
- ప్రస్తుత ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు


దెబ్బతిన్న డిస్ట్రిబ్యూటర్


కోతకు గురైన కాలువ

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీకి సక్రమంగా నీరు రాకపోవడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలో హెచ్చెల్సీ కింద దాదాపు 33వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సబ్‌డివిజన్ పరిధిలో 14డిస్ట్రిబ్యూటరీలు ఉండగా ఒక్కటి కూడా సరిగా పని చేయడం లేదు. గత వైసీపీ పాలనలో కాలువలు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు కూడా పట్టించుకోలేదు. దీంతో ఆయకట్టుకు నీటి గండాలు ఏర్పడ్డాయి. పుట్లూరు, గరుగుచింతలపల్లి చెరువులను కూడా హెచ్చెల్సీ ద్వారానే నింపాలి. అయితే డిస్ట్రిబ్యూటరీలు సరిగా లేకపోవడంతో నీరంతా వృథాగా పోయింది. అయినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు.

ప్రస్తుత ప్రభుత్వంపై ఆశలు

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం రైతులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వమైనా తమ నీటి కష్టాలను తొలగిస్తుందని అన్నదాతలు ఆశగా నిరీక్షిస్తున్నారు. వర్షాలు రాని ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్చెల్సీ నీరు వస్తే ఆయకట్టులో పంటలు పండించుకోవడంతో పాటు, భూగర్భజలాలు పెరిగి బోరుబావులు రీచార్జ్ అవుతాయన్న ఆశ నెలకొని ఉంది. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను ఈ ప్రభుత్వమైనా మరమ్మతులు చేస్తుందేమో నని ఎదురు చూస్తున్నారు. అయితే ఇంతవరకూ 14 డిస్ట్రిబ్యూటరీల్లో ఒక్కదాన్ని కూడా మరమ్మతు చేయలేదు. అలాగే ప్రధాన కాలువకు పడ్డ గండ్లను పూడ్చలేదు. ప్రధానంగా సుబ్బరాయసాగర్ వద్ద ఉన్న 29వ డిస్ట్రిబ్యూటరీ వద్ద నీరు ఎక్కువగా లీకవుతోందని అధికారులు చెబుతున్నారు.

రూ.ఏడు కోట్లతో ప్రతిపాదనలు

14డిస్ట్రిబ్యూటరీలు, కాలువల మరమ్మతులు, ముళ్లపొదలను తొలగించడానికి రూ.ఏడు కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. అయితే రెండురోజుల కిందట రూ. 65 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఇవి ఏ మూలకు సరిపోవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో ఏం పనులు చేపట్టాలో దిక్కుతోచడం లేదని చెబుతున్నారు. 14డిస్ట్రిబ్యూటరీల ఆయకట్టు చెర్మెన్‌లు కలిసి వస్తే ఈ నిధులను ఏదో ఒకదానికైనా వాడుకోవచ్చని చెబుతున్నా, అందరూ కలిసి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఒక్కొక్క డిస్ట్రిబ్యూటరీని మరమ్మతు చేయడానికే రూ.లక్ష నుంచి రూ.1.5లక్షల దాకా ఖర్చు అవుతుందని రైతులు, అధికారులు చెబుతున్నారు. ప్రధాన కాలువ మరమ్మతు చేయడానికి కోట్లు కావాల్సిందేనని వారు పేర్కొంటున్నారు. పాలకులు మరిన్ని నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

మరిన్ని నిధులు కావాలి

14 డిస్ట్రిబ్యూటరీలను మరమ్మతు చేయాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రెండు రోజుల కిందట రూ.65లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయితే ఇవి ఏ పనులు చేయడానికి సరిపోవు. రెండో విడతలో నిధులు వస్తే అన్ని డిస్ట్రిబ్యూటరీలకు సర్దాలన్న ఆలోచనలో ఉన్నాం. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు బాగా డ్యామేజీ అయ్యాయి. పిల్లకాలువలు మరమ్మతులు చాలా ఉన్నాయి. ముళ్లపొదలు తొలగించాలి. డిస్ట్రిబ్యూటరీల చైర్మెన్‌లు సహాయ సహకారాలు అందించినట్లయితే మరిన్ని నిధులు త్వరగా వచ్చే అవకాశం ఉంది. - శ్రీనివాసులు, ఏఈ, తాడిపత్రి

చొరవ చూపండి



గత ప్రభుత్వం నిర్వాకం, అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో సాగు, తాగునీటి పనులపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. హెచ్చెల్సీ కింద తాడిపత్రి పట్టణ పరిసర ప్రాంతంలోనే 10వేల ఎకరాలు సాగు ఉంది. అయితే గత ఐదేళ్లలో ఏ ఒక్కరికి సరిపడినంతగా నీరు అందలేదు. ఈ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి రైతుల పట్ల కనికరం చూపాలి.

- యుగంధర్, యరగుంటపల్లి


సమగ్రశిక్ష కార్యాలయం

సమగ్రశిక్షలో పర్యవేక్షణ గాలికి..!

ఉన్నతాధికారుల మధ్య కొరవడిన సమన్వయం

- ప్రభుత్వ బడులకు రూ.కోట్ల ఖర్చు
- మెరుగుపడని ప్రమాణాలు

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, ఆధిపత్య పోరుతో సమగ్రశిక్షలో పర్యవేక్షణ గాలికి వదిలేశారు. అందరికీ ఉచిత విద్యను అందించాలన్న లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సర్వశిక్షా అభియాన్‌ను తీసుకు వచ్చాయి. 2000-2001 విద్యా సంవత్సరంలో ప్రతిష్టాత్మకంగా ఈ వ్యవస్థను తీసుకొచ్చి వివిధ పథకాల కింద నిధులు ఇస్తూ రూపురేఖలు మారుస్తున్నాయి. ప్రభుత్వ బడులలోనూ కార్పొరేట్ స్థాయిలో విద్యాప్రమాణాలు పెంచడానికి ఎన్నోవసతులు, సాంకేతికతను తీసుకొచ్చారు. ఒకప్పుడు ఈశాఖ గురించి ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అలాంటి శాఖ ఇప్పుడు సమన్వయ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. ఇపుడు సమగ్రశిక్షగా పేరు మార్చారు. ఇప్పటికీ ఎస్ఎస్ఏ ద్వారా పెద్దఎత్తున నిధులు వస్తున్నాయి. అనుకున్నస్థాయిలో విద్యాప్రమాణాలు మెరుగుపడడంలేదని ప్రభుత్వం చేయిస్తున్న వివిధ సర్వేలలో బయటపడుతోంది. సరైన పర్యవేక్షణ లేపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని తెలుస్తోంది.

పథకాలు అమోఘం.. నిధులు అనేకం

అనంతపురం జిల్లాలో విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం.. అన్ని యాజమాన్యాల కింద మొత్తం 1718 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 39, మండల పరిషత్, జడ్పీ పాఠశాలలు 1480, మున్సిపాలిటీ 152, ఏపీ మోడల్ స్కూల్స్ 15, కేజీబీవీలు 32 ఉన్నాయి. ఈ పాఠశాలలన్నింటికీ సమగ్రశిక్ష శాఖ ద్వారానే విద్యాపథకాలు అమలు చేస్తున్నారు. ప్రధానంగా స్కూల్‌గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్, ఎంఆర్‌సీ గ్రాంట్స్, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్, షూస్‌తో పాటు (మిగతా 6వ పేజీలో..)

పాఠశాలలకు నిధులు విడుదల

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ గ్రాంట్స్ విడుదల చేసింది. అనంతపురం జిల్లాలోని 1703 పాఠశాలలకు నిధులు విడుదలయ్యాయి. ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి హెచ్‌ఎంల ఖాతాల్లోకి నేరుగా స్టేట్ ఎస్పీడీ కార్యాలయం నుంచి గురువారం జమ చేశారు. జిల్లాకు ఈ విద్యా సంవత్సరానికి రూ.5.37కోట్లు స్కూల్ గ్రాంట్స్ మంజూరు కావాల్సి ఉంది. అందులో తొలివిడత కింద 50 శాతం చొప్పున రూ.2.68 కోట్లు జిల్లాకు విడుదల చేశారు. వైసీపీ హయాంలో రెండేళ్లుగా స్కూల్‌గ్రాంట్స్ మంజూరు చేయలేదు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభంలోనే గ్రాంట్ ఇవ్వడం పట్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెల 5న ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డేకు ఇందులో నిధులు ఖర్చు పెట్టుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ఈ-స్టాంపుల కుంభకోణం వైసీపీ కుట్ర

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని



అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణం వైసీపీ కుట్ర అని, దీనికి వెనుక మాజీ సీఎం జగన్, మాజీ ఎంపీ రంగయ్య హస్తం ఉందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆరోపించారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సేవ చేయాలన్న ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ఎన్నికల సమయంలో ఒక యూట్యూబ్ చానల్ పేరుతో తనకు ఎర్రప్ప అలియాస్ మీ సేవ బాబు పరిచయమయ్యాడని తెలిపారు. ఎవరినైనా ఆప్యాయంగా మాట్లాడించే తత్వం ఉన్న తనకు ఎర్రప్ప కూడా దగ్గరయ్యాడని అన్నారు. ఎస్ఆర్‌సీ సంస్థ ఇంటర్నల్ ఆడిట్‌లో రూ.23.50 లక్షలు తప్పు జరిగినట్లు ఇటీవల గుర్తించి, తమ సంస్థ ప్రతినిధులు ఎర్రప్పపై పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. ఎర్రప్ప తనతో, తమ నాయకుడు లోకేశ్‌తో, గవర్నర్‌తో ఫొటోలు తీసుకోవడం తప్పయితే.. 11 ఈడీ, సీబీఐ కేసులతో 16 నెలలు జైలులో ఉన్న జగన్ ప్రధాని మోదీ, రాష్ట్రపతితో కూడా ఫొటోలు తీసుకున్నారని, ఆయనతో రంగయ్య ఫొటోలు దిగారని, ఇది తప్పు కాదా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఈ-స్టాక్ హోల్డింగ్ కంపెనీ ఏజెన్సీని కర్నూలులోని నర్సిరెడ్డి, సాంబశివారెడ్డి అనేక వ్యక్తులకు కట్టబెట్టారని అన్నారు. వారిద్వారా ఎర్రప్పకు ఏజెన్సీ ఇప్పించారని అన్నారు. ఎర్రప్పను తమవద్దకు పంపి పావులా వాడుకుని తప్పు చేయించారని, తమపై నిందలు వేసేందుకే మాజీ ఎంపీ రంగయ్య ఇలా చేశారని ఆరోపించారు. 'మా సంస్థ పేరిట ఉన్న ఖాళీ ఈ-స్టాంప్ మీ దగ్గరకు ఎలా వచ్చింది..?' అని మాజీ ఎంపీ రంగయ్యను ప్రశ్నించారు. దీని వెనుక కర్నూలు వ్యక్తులు, రంగయ్య కుట్ర ఉన్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. నకిలీ ఈ-స్టాంప్‌ల వ్యవహారంలో సీబీఐ, ఏసీబీ, సీఐడీ విచారణ జరిపినా తాము సిద్ధంగా ఉంటామని అన్నారు. హత్యలు చేసి డోర్ డెలివరీ చేయడం తమ సంస్కృతి కాదని అన్నారు. మాజీ ఎంపీ వివేకా హత్యను గుండె పోటు అని, బాత్ రూంలో జారిపడ్డారని ప్రచారం చేశారని విమర్శించారు. తాము పన్నుల రూపంలో సుమారు రూ.300 కోట్లు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని, అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. కళ్యాణదుర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నామని, దాన్ని దెబ్బతీసేందుకు రంగయ్య, జగన్ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

బడి తెరవాల్సిందే..!

నేటి ఐచ్ఛిక సెలవు రద్దు

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం ఐచ్ఛిక సెలవును రద్దు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయం తెలియక, జిల్లాలో జగన్నాథ రథయాత్ర నేపథ్యంలో చాలా పాఠశాలలకు ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు ప్రకటించుకున్నారు. యాప్‌లో కూడా నమోదు చేసుకున్నారు. పిల్లల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని, జూలై 5న మెగా పేరెంట్స్ మీటింగ్ ఉన్నందున ఓహెచ్‌ను ఇచ్చుకోవద్దని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే యాప్‌లో ఓహెచ్ నమోదు చేశామని, శుక్రవారం బడికి వెళ్లినా హాజరు నమోదు కాదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓహెచ్‌లను రద్దు చేస్తున్నామని, పాఠశాలలను యథాతథంగా నడపాలని ఉపాధ్యాయులకు ఎంఈఓలు, హెచ్‌ఎంలు సమాచారం ఇచ్చారు. దీంతో గందరగోళం నెలకొంది. మరోవైపు అనంతపురం, అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం మండలాలలో అనేక ప్రభుత్వ పాఠశాలలకు ఇస్కాన్ మధ్యాహ్న భోజనం అందిస్తోంది. జగన్నాథ రథయాత్ర ఉన్నందున ఇస్కాన్ శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని సమకూర్చలేదు. ఈ పాఠశాలల పిల్లలకు శుక్రవారం మధ్యాహ్న భోజనం ఎలా అని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

పాపను అమ్మేశారు..!


చిన్నారి తల్లిదండ్రులను వాహనంలో తరలిస్తున్న పోలీసులు

కదిరి మండలం మరవ తండాకు చెందిన తల్లిదండ్రులు తమ మూడేళ్ల కూతురును కేరళలో అమ్మేశారు. కూలి పనులు చేసుకునే వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ పేదరికం, తండ్రి అనారోగ్యం ఆ చిన్నారికి శాపంగా మారింది. రెండు నెలల క్రితం ఉపాధి కోసం కేరళకు వెళ్లిన దంపతులు.. పాపను అమ్మేసి తిరిగొచ్చారు. దీంతో తన మనవరాలు ఏమైందని తాత నిలదీశాడు. అల్లుడితో గొడవపడ్డాడు. ఇలా విషయం బయటకు పొక్కింది. పోలీసులు తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాపను తిరిగి తీసుకువచ్చేందుకు కేరళకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. (వివరాలు మెయిన్‌లో...)

తల నరికేశారు..!

మైదుగోళంలో వ్యక్తి దారుణ హత్య


రవికుమార్ (ఫైల్)

లేపాక్షి మండలం మైదుగోళం గ్రామంలో రవి కుమార్ అనే వ్యక్తి తలను నరికేశారు. డిన్నర్ పేరిట మూడు రోజుల క్రితం గ్రామ శివారుకు తీసుకెళ్లి.. తల నరికి మొండెం నుంచి వేరు చేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

(వివరాలు 6వ పేజీలో)

ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం సూపర్

- 60 ఏళ్ల వృద్ధురాలికి హెర్నియా ఆపరేషన్
- విజయవంతంగా నిర్వహించిన పామిడి వైద్యులు


డాక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వృద్ధురాలు జమ్మక్క

పామిడి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్య చికిత్సలు అందవనే అభిప్రాయాన్ని పామిడి వైద్యులు చెరిపేశారు. 60 ఏళ్ల వృద్ధురాలికి హెర్నియా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి, ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచారు. మండలంలోని పీ కొండాపురం గ్రామానికి చెందిన అరవై ఏళ్ల వృద్ధురాలు జమ్మక్క పుట్టుకతోనే హెర్నియాతో బాధపడుతుండేది. పేదరిక సమస్యతో ఆమె సరైన చికిత్స చేయించుకోలేదు. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆపరేషన్ చేయాలని చెప్పారు. అయితే అది రిస్క్‌తో కూడుకున్న వ్యవహారమని చెప్పారు. దీంతో ఆమె, కుటుంబసభ్యులు భయపడి శస్త్ర చికిత్స చేయించలేదు. నొప్పి కలిగినప్పుడు ఉపశమనం కోసం ఏవో మందులు వాడేది. అయితే ఇటీవల నొప్పి ఎక్కువ అవడంతో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో వైద్యాధికారి శివ కార్తీక్ రెడ్డిని సంప్రదించారు. పరిశీలించిన ఆయన శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ కమలాధర్‌ను సంప్రదించగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే వృద్ధురాలు, ఆమె కుటుంబ సభ్యులకు శస్త్ర చికిత్సపై ఉన్న ఆందోళనను పోగొట్టి నాలుగు రోజుల కిందట డాక్టర్లు విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించారు. ఇన్నేళ్ల తన బాధను తీర్చిన వైద్యులకు జమ్మక్క కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ కోరారు. అనంతరం వైద్య బృందాన్ని ఘనంగా సత్కరించారు.

మత్తులో పడితే జైలే..!

- లక్ష్యం దిశగా సాగాలి
- యువతకు అధికారుల హితవు
- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ



ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను వినియోగిస్తే జైలు శిక్ష తప్పదని, క్షమాభిక్ష వంటివి ఉండవని అధికారులు హెచ్చరించారు. యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకెళ్లాలని సూచించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ వినోద్ కుమార్, రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి వైస్ చైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఎస్పీ జగదీష్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు. యువత, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకోకుండా తల్లిదండ్రులు డబ్బు, పేరు ప్రతిష్టల సంపాదనలో పడుతున్నారని అన్నారు. తమ బిడ్డలు వ్యసనాల బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందని తెలిపారు. డ్రగ్స్ బారిన పడి ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని అన్నారు. డ్రగ్స్‌ను వినియోగిస్తే పదేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అనంతరం అందరిచేత మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు వరదరాజులు, విశ్వనాథ్, బృంద, అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.



మై భారత్‌గా ఎన్‌వైకే

మై భారత్ ఏపీ డైరెక్టర్ అన్నుమన్ ప్రసాద్‌దాస్



మై భారత్ ఏపీ డైరెక్టర్ అన్నుమన్ ప్రసాద్‌దాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం(ఎన్‌వైకే)ను మై భారత్‌గా మార్చినట్లు ఆ సంస్థ భారత్ ఏపీ డైరెక్టర్ అన్నుమన్ ప్రసాద్‌దాస్ పేర్కొన్నారు. జిల్లాకు గురువారం విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇదివరకు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆర్ఎఫ్ రోడ్డులోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి మై భారత్‌తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల పట్ల అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులకు చేర్చడంలో జాతీయ యువ కార్యకర్తలు మైభారత్ ద్వారా చొరవ చూపాలని కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి రాహుల్ గిర్రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, సాయి ట్రస్టు విజయసాయి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి చాందిని, సభ్యులు దివ్యతేజ, శ్రీకాంత్, మహేంద్రధోని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సీఓలుగా వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు

- ఉమ్మడి జిల్లాలో 43 మందికి డెప్యుటేషన్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీలను మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా డెప్యుటేషన్‌పై పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12మున్సిపాలిటీలకు 43మంది వెల్ఫేర్ సెక్రటరీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం నగర పాలక సంస్థకు వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు అనిల్‌కుమార్, నాగేంద్ర, రామకృష్ణ, రామాంజనేయులు, సుధాకర్, కిశోర్‌కుమార్‌లను కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. షరీఫ్‌ను గుత్తి మెప్మాకు కేటాయించారు. ప్రశాంత్‌ను తాడిపత్రి మెప్మాకు డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. రవి, ఇస్మాన్‌వలీ, రజియాసుల్తానా, నిర్మలాబాయిని గుంతకల్లుకు కేటాయించారు. రామచంద్ర, వి.రామకృష్ణ, బసవరాజు, కృష్ణమ్మ కళ్యాణదుర్గం మెప్మాకు, శివమూర్తి, సరిత, నాగరాజు, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులును రాయదుర్గం మెప్మాకు బదిలీ చేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో....

శ్రీలత, రాజశేఖర్‌ను పుట్టపర్తి మెప్మాకు కేటాయించారు. చిరంజీవి, మంజునాథ్, సిరాలా చంద్ర, ఆలాం వలీ, ప్రవీణ్‌కుమార్, చిన్న నరసింహులును హిందూపురం మున్సిపాలిటీ మెప్మా సీఓలుగా బదిలీ చేశారు. కదిరికి ఆంజనేయులు, రవికుమార్, వెంటరమణ, కృష్ణమూర్తి, హిమగిరి, శ్రీనివాసులును బదిలీ చేశారు. లావణ్య జ్యోతి, కార్తిక్, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, బాలకృష్ణ, అరుణ, వలీబాషాను ధర్మవరం మున్సిపాలిటీలోని మెప్మా సీఓలుగా పంపారు. ఆయా మున్సిపాలిటీలకు కేటాయించిన వెల్ఫేర్ సెక్రటరీలు వెంటనే మెప్మా సీఓలుగా బాధ్యతలు స్వీకరించాలని ఉమ్మడి జిల్లా మెప్మా పీడీ విశ్వజ్యోతి తెలిపారు.

గురుకుల ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు గురుకుల పాఠశాలల సమన్వయకర్త జయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి మిగిలిన సీట్లకు ఈనెల 28న కౌన్సెలింగ్ నిర్వహించాలనుకున్నామని, అయితే రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

దివ్యాంగులశాఖ ఏడీగా అర్చన



ఏడీ అర్చనకు శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా అర్చన నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ వినోద్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలు నుంచి జిల్లాకు అర్చనను నియమించారు. ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఏడీకి దివ్యాంగుల పోరాట సమితి నాయకులు హరినాథరెడ్డి, సుధాకర్, ఈశ్వర్, రామిరెడ్డి, కార్యాలయ సిబ్బంది కొత్త ఏడీకి శుభాకాంక్షలు తెలిపారు.

పనులను త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్స్ కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధించిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్‌కు సంబంధించి 2024-25లో 116 పనులను గుర్తించామన్నారు. ఇందుకోసం రూ.11.72కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటివరకు 10 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.4కోట్లతో 27 పనుల కోసం ప్రతిపాదనలు వచ్చాయని, చెక్‌లిస్ట్ ప్రకారం పనులకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖ అధికారులు అందజేయాలన్నారు. ఇతర ప్రాధాన్యతల కింద 61 పనులకు రూ.65కోట్లతో ప్రతిపాదనలు వచ్చినట్లు పేర్కొన్నారు. మినరల్ ఫండ్స్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతి రూపాయి ఖర్చుని పరిశీలిస్తుందన్నారు. మంజూరైనా ఇంకా మొదలు పెట్టని పనులను క్షేత్రస్థాయిలో ఆయా శాఖల అధికారులు తనిఖీ చేయాలన్నారు. వారం రోజుల్లో తనిఖీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మైన్స్ ఏజీ ఆదినారాయణ, డీపీఓ నాగరాజునాయుడు, డీటీడబ్ల్యుఓ రామాంజినేయులు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీవీఈఓ వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.32వేలు

అనంతపురం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గైరంగాలు గరిష్ఠంగా రూ.32వేలు అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.15వేలు, సరాసరి రూ.20వేలకు విక్రయాలు జరిగాయన్నారు. సీజనల్ రకం కాయలు టన్ను గరిష్ఠంగా 18వేలు, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికినట్లు చెప్పారు.





ఆకులపై లద్దె పురుగు

← లద్దెపురుగు రంధ్రాలు చేసిన మొక్కలు, నంబులపూలకుంట వద్ద సాగుచేసిన వేరుశనగ పంట ↑

రెండుసార్లు మందులు పిచికారీ చేశా



నేను ఐదు ఎకరాల్లో బోరుకింద ముందస్తుగా వేరుశనగ పంట సాగుచేశా. రూ. లక్షా 20వేల వరకు ఖర్చువచ్చింది. ముందుగా సాగుచేస్తే మంచి దిగుబడి వస్తుందని, మార్కెట్‌లో మంచి ధరలు ఉంటాయని విత్తనం వేశా. పంట సాగు చేసి నెలన్నర దాటింది. లద్దెపురుగు రాత్రి సమయంలో ఆకులను తినేస్తోంది. పచ్చ పురుగు, రసం పీల్చే పురుగులు సోకాయి. ఇప్పటికే రెండుసార్లు మందులు పిచికారి చేశా. వారం రోజుల నుంచి ఎండ లేకపోవడంతో చీడపీడలను నివారించలేకపోతున్నాం.

\- రాజగోపాల్‌రెడ్డి, రైతు, ఎర్రవంకలవారిపల్లి

ఆరంభంలోనే చీడపీడలు

- వేరుశనగను ఆశిస్తున్న లద్దెపురుగు
- మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని వైనం

నంబులపూలకుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముందుగా సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఆశించిన వేరుశనగ రైతులను చీడపీడలు బెంబేలెత్తిస్తున్నాయి. నంబులపూలకుంట మండలంలో బోరుబావుల కింద పలువురు రైతులు తొలి వర్షాలకు వెయ్యి ఎకరాలకు పైగా వేరుశనగను సాగుచేశారు. విత్తనం వేసి నెలరోజులు దాటిపోవడంతో పూత దశకు చేరుకుంది. ఈ దశలో పంటకు లద్దె పురుగు ఆశించి ఆకులను తినేస్తోంది. రెండుసార్లు మందులు పిచికారి చేసినా పురుగును నివారించలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పచ్చ పురుగు, రసం పీల్చే పురుగులు ఆశించడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. సూర్య రశ్మి సోకినపుడు లద్దె పురుగు బయటకు రాకుండా ఆకు కిందిభాగంలో గూళ్ల కట్టుకుని ఉంటుంది. రాత్రిసమయంలో ఆకులపైకి వచ్చి తినేస్తుంటుంది. చిగురును తింటే మొక్క ఎదుగుదల ఉండదు. మందులు పిచికారి చేస్తున్నా పదిరోజులుగా సూర్యకిరణాలు సోకకపోవడంతో పురుగులు ఉధృతంగా పెరుగుతున్నాయి. రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసి నష్టపోయిన రైతులు ఖరీఫ్‌లోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎకరా పంట సాగుకు ఇప్పటికే రూ.20వేల దాకా ఖర్చు చేశామని అంటున్నారు. మార్పిడితో దిగుబడి బాగా వస్తుందని ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. ధర బాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ట్యాక్-20 రకం విత్తనాలు వేశారు. కాయలు లావుగా, గింజలు నాణ్యంగా ఉండడంతో పచ్చికాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. దీంతో చాలా మంది రైతులు వీటివైపు మొగ్గు చూపారు.

లద్దె పురుగులను నియంత్రించుకోవాలి

లద్దె పురుగు నివారణ చర్యలు తీసుకోకపోతే పంట మరింత నష్టపోయే ప్రమాదం ఉంటుంది. లద్దె పురుగుల నివారణకు పొలాల్లో విషపు ఎర్రలను తయారు చేసుకోవాలి. వరి తౌడు ఐదు కిలోలు, బెల్లం అర కిలో, క్లోరోపైరిపాస్ 500 ఎంఎల్ కలిపి ఉండలుగా తయారు చేసి, పొలంలో వేయాలి. లింగాకర్షక బుట్టలు పెట్టి, వాటిని గమనిస్తూ ఉండాలి. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పక్షి స్థావరాలను కూడా ఏర్పాటు చేస్తే లద్దె పురుగులను పక్షులు తినేస్తాయి. పచ్చపురుగులు, రసంపీల్చే పురుగులు ఉంటే థైయోడిక్ కార్బ్ 200 గ్రాముల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేదా ఫ్లూబెండమైడ్ 400 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే చీడపీడలను నివారించవచ్చు. పొలాలకు యూరియా ఎక్కువగా వేయడం వల్ల ఇలాంటి చీడపీడలు సోకుతున్నాయి.

\- లోకేశ్వర్ రెడ్డి, వ్యవసాయ అధికారి

పూత దశలోనే చీడపీడలు



నేను రెండు ఎకరాల్లో ముందుగా వేరుశనగ సాగుచేశా. పంట సాగుకు రూ. 40వేలు ఖర్చు చేశా. పంట పూత దశలో ఉంది. ప్రస్తుతం చీడపీడల నుంచి పంటను కాపాడుకుంటే, పిందెలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. లద్దె పురుగుల నివారణకు ఇప్పటికే ఒకసారి మందు పిచికారి చేశా. మరోసారి పిచికారి చేద్దామంటే పదిరోజులుగా వాతావరణం అనుకూలించలేదు. చీడపీడలను నివారించకపోతే పంట ఏమాత్రం చేతికి వచ్చే అవకాశం లేదు.

\- ప్రతాప్‌రెడ్డి, రైతు, తూర్పునడింపల్లి

తల నరికేశారు..!

- మైదుగోళంలో వ్యక్తి దారుణ హత్య
- వివాహేతర సంబంధమే కారణమని ప్రాథమిక నిర్ధారణ
- పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు



సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లేపాక్షి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైదుగోళం గ్రామానికి చెందిన బోయ రవి కుమార్(37) దారుణ హత్యకు గురయ్యాడు. అతని తలను నరికేసి.. మొండెం నుంచి వేరు చేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

డిన్నర్ ఏర్పాటు చేసుకుని..

మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇదే గ్రామంలోని తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి మంగళవారం రాత్రి డిన్నర్ ఏర్పాటు చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం, చికెన్ తెచ్చుకున్నారు. చికెన్ వండాలని తన భార్య గీతకు చెప్పి.. రవికుమార్ బయటకు వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని నీటి గుంత వద్దకు ఆనంద్, రవికుమార్ వెళ్లి మద్యం సేవించి, తిరిగి ఇంటికి వచ్చారు. వండిన చికెన్‌ను తీసుకుని ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో బయటకు వెళ్లిపోయారు. ఆ తరువాత రవి కుమార్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బుధవారం ఉదయం ఆనంద్‌ను గీత నిలదీసింది. తన భర్త ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నిస్తే.. తెలియదని బుకాయించాడు. 'నీతోనే కదా కలిసి వెళ్లింది..? ఏమయ్యాడో తెలియదంటే ఎలా..? చెప్పకపోతే నీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా' అని గీత హెచ్చరించింది. దీంతో 'ఏమైనా చేసుకో.. నాకు సంబంధం లేదు' అని ఆనంద్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రవి కుమార్ ఆచూకీ లభించకపోవడంతో లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో అతని తండ్రి అశ్వర్థప్ప బుధవారం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు గ్రామ పొలిమేరల్లో గాలిస్తుండగా గురువారం ఉదయం రవి కుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రవి కుమార్ తల నరికి నీటి కుంటలో పడేసినట్లు గుర్తించారు. హత్య జరిగిన సమయంలో ఆనంద్‌తోపాటు మరొకరు అక్కడ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హతుడి భార్య ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకరి భార్యతో రవికుమార్ సన్నిహితంగా ఉండేవాడని, వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కారణంగానే రవి కుమార్‌ను హత్య చేశారని భావిస్తున్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి కుమార్ భార్య నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. హత్యకు గురైన రవి కుమార్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

డ్రగ్స్ అలవాటైతే నేరస్థులే..!

- మాదకద్రవ్యాల దుర్వినియోగంతో జీవితాలు నాశనం
- మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినంలో వక్తలు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను అలవాటుగా ప్రారంభిస్తే.. తర్వాత నేరస్థులుగా మారే ప్రమాదం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా దినాన్ని పురస్కరించుకుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల ఆధ్వర్యంలో గురువారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అనంతపురం సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఇతర అధికారులు హాజరై మాట్లాడారు. ముందుగా న్యాయాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ యువత సోషల్ మీడియా, సెల్‌ఫోన్లు, డ్రగ్స్ వంటి వాటితో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనేక సర్వేల్లో దేశంలో 18 కోట్ల మందికిపైగా డ్రగ్స్ బాధితులున్నట్టు తేలిందన్నారు. యువత చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తర్వాత చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, డిగ్రీ ఇతర హయ్యర్‌కోర్సులు చదివే క్రమంలో యువత డ్రగ్స్ వైపు తప్పటడుగు వేస్తున్నారన్నారు. ముఖ్యంగా హోటళ్లు, బార్లలో బర్త్ డే పార్టీలకు వెళ్లినప్పుడు ఎక్కువగా ఈ అలవాట్లకు దగ్గర అవుతుంటారన్నారు. విద్యార్థులు వీటికి చాలా వరకూ దూరంగా ఉండాలని సూచించారు. మంచి భవిష్యత్తు ఉండాలంటే డ్రగ్స్‌కు దూరంగా జీవించాలని సూచించారు. రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ గమ్యం, లక్ష్యాలను ముందే నిర్ణయించుకుని వాటి సాధనకు అడుగేయాలన్నారు. వ్యసనాలకు లోనుకాకుండా కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ఇతర ఇన్‌స్పెక్టర్లు జయనాథరెడ్డి, నాగసునీతారాణి, సబ్ ఇన్‌స్పెక్టర్లు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తున్న మహిళ గొలుసు చోరీ

శింగనమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బైకు మీద వెళ్తున్న మహిళ నుంచి బంగారు గొలుసు లాక్కున్న సంఘటన గురువారం లోలూరు క్రాస్‌లో జరిగింది. శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్ బాధితులు రామాంజినమ్మ, జయచంద్రరెడ్డి తెలిపిన మేరకు గార్లదిన్నె గ్రామానికి చెందిన జయచంద్రరెడ్డి, రామాంజినమ్మ దంపతులు గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై అనంతపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తిరిగి గార్లదిన్నెకు బయల్దేరారు. లోలూరు క్రాస్ వద్దకు రాగానే అనంతపురం నుంచి ఒక యువకుడు ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి దంపతుల వాహనాన్ని సమీపించాడు. రెప్పపాటు కాలంలో మహిళ మెడలో వేసుకున్న మూడు తులాల బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కొని అదే వేగంతో తిరిగి అనంతపురం వైపు వెళ్లిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తి తూకాల్లో మోసం

- రిమోట్‌తో మాయ చేసిన ఆదోని వ్యాపారులు

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన పత్తి వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడ్డారు. మండల పరిధిలోని క్రిష్ణాపురం గ్రామంలో మూడు రోజుల నుంచి పలువురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రిమోట్ సాయంతో కాటాను నియంత్రించి, తూకాలలో మోసానికి తెరలేపారు. తిప్పేస్వామి, వన్నూరుస్వామి, కొత్తపల్లి తిప్పయ్య, సుబ్బు తదితరుల నుంచి క్వింటం రూ.7,400 నుంచి రూ.7,800 వరకు ధరకు కొనుగోలు చేశారు. కాటా వేసే సమయంలో మొబైల్ ద్వారా రిమోట్‌ను వినియోగించి, మోసాలకు తెరలేపారు. రైతు తిప్పేస్వామికి అనుమానం వచ్చి పరిశీలించగా.. క్వింటానికి 20 కేజీలు ఎక్కువగా తీసుకున్నట్లు తేలింది. రైతులు ఆగ్రహించడంతో వ్యాపారులు పారిపోయారు. దళారులు జోక్యం చేసుకుని, గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. వారి జోక్యంతో 250 క్వింటాళ్లకు నగదు కట్టించేలా ఒప్పించారు. ఈ వ్యవహారంపై కొందరు గ్రామస్థులు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వ్యాపారులు, రైతులు రాజీ కావడంతో మిన్నకుండిపోయారు. రైతుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైద్యులే పరిపాలనాధికారులు

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్య కేంద్రం(పీహెచ్‌సీ)లోని వైద్యులే ఆ కేంద్ర పరిధిలో పరిపాలనా అధికారులని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ ప్రోటోకాల్స్ అనే అంశంపై పీహెచ్‌సీ డాక్టర్లకు నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు వైద్యసేవల కోసం పీహెచ్‌సీకి వస్తారన్నారు. వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించడం డాక్టర్ల బాధ్యతన్నారు. మీ పరిధిలోని వైద్యశాఖ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్లు కేవలం వైద్యసేవలందించడమే కాదని పరిపాలనలో భాగస్వాములని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆర్బీఎస్కే బాలల ఆరోగ్య స్క్రీనింగ్‌లో భాగంగా చిన్నారులకు పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను త్వరతగతిన గుర్తించి వైద్యసేవలందించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు యుగంధర్, నారాయణస్వామి, డాక్టర్ జగదీష్ నాయక్, డీఈఐసీ మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకూడదు

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి కౌమార బాలికల సాధికారత, బాల్యవివాహాల నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు సంబంధించి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా వివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కోసం ఏఏ డాక్యుమెంట్లు తీసుకుంటున్నారో డెకాయ్ ఆపరేషన్ చేసి పరిశీలిస్తామన్నారు. ఇప్పటివరకు అమ్మాయిల మిస్సింగ్‌పై ఎన్ని కేసులున్నాయో జాబితా తయారు చేసి, టైం పీరియడ్ లోపు ఎస్‌హెచ్ఓలు డాక్యుమెంటేషన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీఎస్పీ మహబూబ్‌బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో పర్యవేక్షణ గాలికి..!

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్న భోజనం, బుద్ధిమాంధ్యత పిల్లలకు ప్రత్యేక బడులు, వైద్యసేవలు, ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం కేజీబీవీలు, కరువు, ఇతర కారణాలతో బడులుకు రాని పిల్లలకు ప్రత్యేక బడులు, వసతులు కల్పిస్తున్నారు. పాఠశాలల మరమ్మతులు, కొత్తభవనాలు, ల్యాబ్‌లు, మైదానాలు వంటి వాటికి నిధులు విడుదల అవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ఎస్ఎస్ఏ శాఖ సెక్టోరల్స్, అసిస్టెంట్ సెక్టోరల్స్ ఇతర సిబ్బందితో కలకలలాడుతూ ఉండేది. ఉదయం కార్యాలయానికి రాకనే జిల్లాలోని వివిధ పాఠశాలల తనిఖీలకు వెళ్లి పథకాలు అమలు, నిధుల ఖర్చు, విద్యాప్రమాణాలను పరిశీలించేవారు. ప్రస్తుతం ఎస్ఎస్ఏలో నిర్మానుష్యం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూలై నెలలో ఇక్కడ ఉన్న సెక్టోరల్ ఆఫీసర్లను రిలీవ్ చేసి సొంత శాఖకు పంపించారు. అప్పటి నుంచి కొత్తసెక్టోరల్స్‌ను నియమించుకోలేదు. దీంతో ఏడాది నుంచి పాఠశాలలో విద్యాపథకాలను పరిశీలించేవారు, అడిగేవారే కరువయ్యారు. ఎస్ఎస్ఏ ఈ పరిస్థితికి ఆ శాఖకు చెందిన ఇద్దరు అధికారులకు పెత్తనం ఇవ్వడం కూడా కారణమన్న విమర్శలు ఆ శాఖలో వినిపిస్తున్నాయి. గతంలో ఎస్ఎస్ఏకు ప్రాజెక్టు ఆఫీసర్(పీఓ) ఒక్కరే ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు అధికారులను నియమించారు. పీఓ స్థానంలో ఏపీసీ (అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్)ని ఏర్పాటు చేశారు. ఏపీసీ కన్నా పైఅధికారిగా డీఈఓకు డీపీసీ(డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్)గా అధికారం అప్పగించారు. ఏపీసీ ఏమి చేయాలన్నా డీపీసీకి ఫైల్‌పెట్టి వారి ఆమోదం తీసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు సాగుతూ విద్యావ్యవస్థలు దెబ్బతింటున్నాయి.

పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి



విద్యా పథకాల అమలు, పాఠశాలల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఇప్పటి వరకు ఉపాధ్యాయుల బదిలీలు ఉండడంతో పర్యవేక్షణ చేయలేకపోయాం. ఆ ప్రక్రియ ముగిసింది. ఇక పాఠశాలల తనిఖీలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇచ్చిన నిధులు నిబంధనల మేరకే ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా వినియోగించినట్లు తేలితే చర్యలు తప్పవు.

\- ప్రసాద్‌బాబు, డీపీసీ, ఎస్ఎస్ఏ

సెక్టోరల్స్ నియామకాలకు నోటిపికేషన్ ఇచ్చాం



ఎస్ఎస్ఏలో పథకాలు సక్రమంగా అమలు కావాలంటే సెక్టోరల్స్ చాలా అవసరం. వివిధ కారణాల వల్ల నేను రాక మునుపటి నుంచి ఇక్కడ సెక్టోరల్స్ నియామకాలు జరగలేదు. ఇపుడు నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తాం. తర్వాత పాఠశాలలు, విద్యాపథకాల అమలుకే ప్రాధాన్యం ఇస్తాం.

\- శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

కర్ణాటక వాసి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం ఎదురుగా రాయచూరు జిల్లా లింగసూగూరుకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సమీపంలోని పార్కులో ఓ చెట్టుకు శరణప్ప(39)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను బేల్దారి పనిచేసుకుని జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్తునట్లు ఇంట్లో చెప్పి బయల్దేరాడు. అయితే గురువారం ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య శ్రీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వద్దనుకున్నారా... వదిలేశారా?

● నాలుగు రోజులుగా బ్యాంకు వద్ద ద్విచక్రవాహనం


వదిలి వెళ్లిన ద్విచక్రవాహనం

విడపనకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం నాలుగు రోజులుగా ఉంది. దీన్ని గమనించిన స్థానికులు విడపనకల్లు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఖాజాహుస్సేన్ ద్విచక్రవాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. ఈ ద్విచక్రవాహనం నంబరు(ఏపీ 02కే 2940) ఆధారంగా పరిశీలించగా గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామానికి చెందిన కే రామన్న అనే వ్యక్తి పేరున రిజిస్టర్ అయి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహన యజమానులు రికార్డులతో విడపనకల్లు పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన పూజ(19) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు బళ్లారికి చెందిన జ్యోతి, సన్న ఈరప్ప దంపతుల కుమార్తె పూజ(19)ను కుడితినికి చెందిన రాజేష్‌కు ఇచ్చి ఆరునెలల కిందట వివాహం చేశారు. వీరు కొంతకాలం నుంచి మండల కేంద్రంలోని దాసరి రామ్మూర్తి అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ పాత్ర వస్తువులు వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. ఏం జరిగిందో తెలియదు కాని ఈ నెల 19న రాత్రి దోమల నివారణకు ఉపయోగించే ద్రావకాన్ని తాగి పూజ ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలు గతంలో మూర్ఛవ్యాధితో మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తుండేదని మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటకలో తూమకుంట యువకుడి హత్య


రవికుమార్ (ఫైల్)

హిందూపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుడుమలకుంట సమీపంలో గురువారం సాయంత్రం హిందూపురం మండలం తూమకుంటకు చెందిన రవికుమార్(35) హత్యకు గురయ్యాడు. తూమకుంటకు చెందిన ఉప్పర రవికుమార్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కానీ కొంతకాలంగా వారికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం సరిహద్దులోని బార్ వద్ద మద్యం సేవించి ఓ వ్యక్తితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో రవికుమార్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశారు. గౌరీబిదునూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరీబిదనూరు రూరల్ పోలీసులు తెలిపారు. కాగా రవికుమార్‌ను హత్యచేసిన నిందితున్ని తొండేబావి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వారిని తీసేయండి

● అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

యల్లనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్‌షాపు డీలర్లుగా కొనసాగుతున్న వారిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి ఎక్కువైనట్లు తెలుస్తోంది. సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చిన అధికారులు సీట్లో కూర్చొని పదిరోజులు కాకముందే అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి వస్తుండటంలో వారు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని నాలుగైదు పంచాయతీల్లో రేషన్‌షాపులు నేటికి వైసీపీ వారే నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా కొన్నిచోట్ల పాతవారే కొనసాగుతున్నారు. ఇప్పటికి ఆయా పంచాయతీల్లో వైసీపీ నాయకుల పెత్తనం ఉండడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి వారిని వెంటనే మార్చాలని టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను గురువారం ఎంపిక చేశారు. స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. అండర్-10 బాలురలో గౌతమ్‌కృష్ణ, హరియాన్, సాధ్విన్, మోహన్‌కృష్ణ ఎంపిక కాగా బాలికల విభాగంలో అన్వి, అశ్విత, చైత్ర చోటు సాధించారు. అండర్-12 బాలురలో ఫణికుమార్, జశ్విత్‌రెడ్డి, జావీద్, నరేందర్, దుర్గా, బాబాఫకృద్దీన్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో ముక్త, లిఖితబాయి, దీక్ష, హిమబిందులు ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.


ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులు

సిఫార్సు లేఖలతో తలనొప్పి

● ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కుప్పలు తెప్పలుగా సిఫార్సు లేఖలు

● తలలు పట్టుకుంటున్న యంత్రాంగం


పీఆర్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)

అనంతపురం న్యూటౌన్ జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీలకు సంబంధించి సిఫార్సు లేఖలు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారాయి. సచివాలయ సిబ్బంది బదిలీలకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి బదిలీ తప్పనిసరి చేసింది. దీంతో కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమకు అనుకూలమైన స్థానాల మీద కన్నేశారు. దాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల సిఫార్సు లేఖలను బదిలీ దరఖాస్తుకు జత చేసి ఉన్నతాధికారులకు ఇస్తున్నారు. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న ఈ సిఫార్సు లేఖలే అధికారులకు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే ఉన్న స్థానాలు రేషనలైజేషన్‌లో భాగంగా తగ్గిపోయాయి. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చి కొత్తవారిని తెచ్చుకుంటే వారితో పని చేయించుకోవడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. పైగా బదిలీలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అసలు ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో అసలు బదిలీలు జరుగుతాయా? లేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

తగ్గిన 300 పోస్టులు

అనంతపురం జిల్లాకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోస్టులు 483 ఉన్నాయి. ఇందులో 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా 334 మంది పని చేస్తున్నారు. 85 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రేషనలైజేషన్‌లో 300 పోస్టులు దాక తగ్గిపోయాయి. దీంతో ఆ స్థానాల్లో ప్రస్తుతానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఉన్నా ప్రస్తుత బదిలీల్లో అక్కడ పోస్టులు లేనట్లు చూపిస్తున్నారు. దీంతో మొదటిగా రేషనలైజేషన్‌కు అనుగుణంగా సర్దుబాటు చేసి బదిలీలు చేపట్టాలని సిబ్బంది రాష్ట్ర స్థాయి అధికారుల వద్ద నిరసన తెలుపుతున్నారు. దీంతో పాటు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీటిని పరిష్కరించిన తరువాత బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం వీటిని పట్టించుకోకుండా వారి పని వారు చేసుకుపోతున్నారు.

నకిలీ బంగారంతో రుణం.. గుట్టు రట్టు

ముగ్గురు నిందితుల అరెస్ట్

నార్పల ప్రైవేట్ బ్యాంకులో మూడు దఫాలుగా తాకట్టు

రూ.9 లక్షలు పైబడి రుణం పొందిన దుండగులు

నార్పల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ బంగారం ఆభరణాలు పెట్టి రుణం తీసుకొని మోసం చేసిన కేసులో ముగ్గులు నిందితులను నార్పల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను సీఐ కౌలుట్లయ్య వెల్లడించారు. నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, యల్లనూరు దాదాపీర్, మహమ్మద్ రఫీలు కలిసి ఇమ్రాన్ పేరు మీద ప్రైవేట్ బ్యాంకులో ఖాతా ప్రారంభించారు. తొలిసారి నాలుగు నకిలీ బంగారు గాజులుపెట్టి రూ. 3,21,693లు, రెండోసారి రెండు నకిలీ బంగారు కడియాలు పెట్టి రూ.3,53,174లు, మూడోసారి మూడు నకిలీ బంగారు గాజులు పెట్టి రుణం తీసుకున్నారు. ఇలా మొత్తం రూ. 9,46,890లు రుణం తీసుకున్నారు. ఈనెల 23న బ్యాంకు గోల్డ్ లోన్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో మొత్తం 125.8 గ్రాములు నకిలీ బంగారాన్ని గుర్తించారు. దాని మీద రూ.9,46,890లు లోన్ తీసుకున్నట్లు గుర్తించి నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే ముగ్గురు నిందితులు మరోసారి నేరం చేసేందుకు ప్రయత్నించగా నార్పల ఎస్ఐ సాగర్, సిబ్బంది గురువారం వారిని అరెస్ట్ చేసి, వారి నుంచి పది బంగారు నకిలీ గాజులు, రెండు బంగారు కడియాలు, మూడు నకిలీ బంగారు ఉంగరాలు, ఒక ద్విచక్రవాహనం, కారును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురితో పాటు మరో ఆరుగురు నేరం చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

లక్కు ఎవరికో..!

అనంత ఏడీఏ పోస్టుపై సందిగ్ధత

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఏడీఏ పోస్టు భర్తీపై సందిగ్ధత వీడలేదు. పక్షం రోజుల నిరీక్షణ తర్వాత బుధవారం రాత్రి ఆలస్యంగా ఏడీఏ బదిలీల రెండో జాబితాను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలో కేటాయించిన స్థానాలే ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. తొలి జాబితాలో హిందూపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌ను అనంతపురం ఏడీఏగా, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్యను హిందూపురం ఏడీఏగా నియమించారు. అయితే రెండో జాబితాలో అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలు ఖరారు చేయకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. తొలి జాబితాలోని కొన్ని స్థానాలు మార్పు చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు అనుమతి కోసం సీఎం కార్యాలయానికి ఫైల్ పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనంత ఏడీఏ పోస్టు ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ ఆ శాఖ వర్గాల్లో నెలకొంది.

ఏడుగురికి తొలి జాబితాలోని స్థానాలే ఖరారు

ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలోని స్థానాలే ఖరారు చేశారు. అనంతపురం ఏడీఏ రవిని తాడిపత్రికి బదిలీ చేశారు. కదిరి ఏడీఏ సత్యనారాయణను ఉరవకొండకు, తాడిపత్రి ఏడీఏ చెంగల్‌రాయుడును కర్నూలు జిల్లా ఆలూరుకు, మడకశిర ఏడీఏ కృష్ణమీనన్‌ను పెనుకొండకు, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సనావుల్లాను కదిరికి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్‌ను ధర్మవరం, ఉరవకొండ ఏడీఏ పద్మాజను రాయదుర్గం ఏడీఏగా బదిలీ చేశారు. దీంతో వారు పాత స్థానాల్లో రిలీవ్ అయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అయిష్టంగా.. ఆవేదనతో..!

దూరప్రాంతాలను కోరుకున్న టీచర్లు

ముగిసిన 1998 ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆందోళనను ఎక్కువ కాలం కొనసాగించలేక దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో 1998 ఎంటీఎస్ టీచర్లు తీసుకున్నారు. విద్యాశాఖాధికారులు పట్టుదలగా తాము అనుకున్నట్లుగానే ఖాళీలు చూపించి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంటీఎస్ టీచర్లలో చీలికరావడం, 2008 ఎంటీఎస్ టీచర్లు బుధవారం కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో విద్యాశాఖ యంత్రాంగం పట్టుబిగించింది. ఈ నేపథ్యంలోనే మిగిలిన 1998ఎంటీఎస్ టీచర్లను గురువారం కౌన్సెలింగ్‌కు రావాలని విద్యాశాఖ ఆహ్వానించింది. దీంతో వారు మధ్యాహ్నం జిల్లా సైన్స్‌సెంటర్‌కు చేరుకు న్నారు. తొలుత అక్కడ సమావేశమై కౌన్సెలింగ్‌కు హాజరవుదామా.. వద్దా అని చర్చించుకున్నారు. అయితే చాలామంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'రోజూ ఇక్కడికి రావడం..వెళ్లడం ఏంటి? మనం కౌన్సెలింగ్‌కు పోదాం. పాఠశాలలు కోరుకుందా. ఇష్టమైతే వెళ్దాం. లేదంటే సెలవు పెడదాం. అదికూడా కాకుంటే వదిలేద్దాం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయిష్టతతోనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్ఓ శ్రీనివాసులు కౌన్సెలింగ్‌కు హాజరైన ఎంటీఎస్ టీచర్లకు ఖాళీలు చూపిస్తూ వారుకోరుకున్న స్కూల్స్‌ను కేటాయించారు. 1998ఎంటీఎస్ టీచర్లు 394మంది హాజరయ్యారు. వీరందరూ దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో కోరుకున్నారు.

నకిలీ గుడ్‌నైట్..!

ఏరియల్, టైడ్ కూడా..!

విజిలెన్స్ తనిఖీలో బట్టబయలు


గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం/గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. అనంతపురం, గుంతకల్లులోని పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. దోమల నియంత్రణకు వినియోగించే గుడ్‌నైట్ లిక్విడ్ నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్నారని హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి, ఈ దాడులు చేశారు. అనంతపురంలోని రాజారాం కిరాణం దుకాణం, సోమేశ్వర్ ట్రేడర్స్, లక్ష్మీ జనరల్ స్టోర్స్, గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్, రాజ్యలక్ష్మి జనరల్ స్టోర్స్, మహాదేవ్ జనరల్ స్టోర్స్, భవాని జనరల్ స్టోర్స్ అరతి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశారు. నకిలీ గుడ్ నైట్ మస్కిటో లిక్విడ్, ఏరియల్, టైడ్ డిటర్జెంట్ పౌడర్ ప్యాకెట్లను పలు దుకాణాలలో గుర్తించారు. రూ.1.41 లక్షల విలువైన నకిలీ ఉత్పత్తులను సీజ్ చేశారు. గుంతకల్లులో గుడ్‌నైట్ లిక్విడ్ డూప్లికేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని గొద్రెజ్ కంపెనీ నిర్వాహకులు తమకు ఫిర్యాదు చేశారని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఐదు జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశామని, రూ.97,675 విలువ చేసే నకిలీ గుడ్‌నైట్ లిక్విడ్‌కు సంబంధించిన 926 బాక్సులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నకిలీ సరుకు ఈ దుకాణాలకు ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారిస్తున్నామని తెలిపారు. దాడుల్లో డిప్యూటీ ఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాస్, జమాల్ బాషా, ఏవో వాసుప్రకాష్, ఏఈఈ రవీంద్రనాథ్, డీసీటీఓ సురేష్, గుంతకల్లు తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్, విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్, డిప్యూటీ ఏసీ హుస్సేన్ పీరా, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్లు శంకర్, ఖాజాహుస్సేన్, జీఎస్టీ శాఖ శాఖ నుంచి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసింది వైసీపీనే

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయిని పరిచయం చేసిన పార్టీ వైసీపీ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. పెనుకొండలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గంజాయి విరివిగా ఉండేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం దాన్ని నామరూపాలులేకుండా చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రి నారాలోకేశ్ తీసుకున్న చర్యలవల్ల గంజాయిని పూర్తిగా నిర్మూలించామన్నారు. డ్రగ్స్ వాడితే కుటుంబాలు ఏవిధంగా చిన్నాభిన్నం అవుతాయో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేష్, ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో మంత్రి సవిత

భూసేకరణపై గ్రామ సభలు: కలెక్టర్


భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చేపట్టిన భూ సేకరణలపై ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై సంబంధితాధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో పలు ప్రాంతల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు భూసేకరణ చేయాలని అందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలు సేకరించి, సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. సమావేశం లో రెవెన్యూ అధికారులు, నెట్ క్యాప్ అధికారులు, సోలాప్ పవర్‌పాయింట్ ప్రతినిధులున్నారు.

మత్తుపై కఠిన చర్యలు: డీఐజీ

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను సాగు చేసినా, వినియోగించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీ హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణ విషయంలో రాజీ పడబోమని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. కుటుంబాలు దెబ్బతింటాయని, పిల్లలు భవిష్యత్తు కోల్పోతారని హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్స్, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరి ఎంపిక


హిమజ, సజీద

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-18 జాతీయ బాలికల కబడ్డీ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరపున జిల్లా క్రీడాకారిణులు సజీద, హిమజ పాల్గొన నున్నారు. ఎంపికైన క్రీడాకారులను అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, విద్యుత్తుశాఖ విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ లక్ష్మణ్, సీనియర్ క్రీడాకారులు శ్యాంకుమార్, రాఘవేంద్ర, శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, సంధ్యలు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను అభినందించారు.

ఉద్యాన పథకాలను వాడుకోండి

● డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, శ్రీసత్యసాయి జిల్లా డీడీ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, సపోటా, రేగు, అరటి, బొప్పాయి, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర, ప్యాషన్ ఫ్రూట్, ఉసిరి, నేరేడు, చింత, ఫల్సా ఫ్రూట్, విడి పూల సాగు, హైబ్రీడ్ కూరగాయలు, పుట్టగొడుగుల పెంపకానికి ప్రభుత్వ సబ్సిడీ వర్తింపస్తుందన్నారు. పాతతోటల పునరుద్ధరణ, రక్షిత సేద్యంలో భాగంగా పాలి హౌస్, షేడ్‌నెట్, కవర్స్ ప్లాస్టిక్ మల్చింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట కోత అనంతరం చర్యల యాజమాన్యంలో భాగంగా ప్యాక్ హౌస్, యూనిట్ ప్రాసెసింగ్, కోల్డ్ రూమ్ తదితర వాటిని మంజూరు చేస్తామన్నారు. ఉద్యాన యంత్రీకరణలో భాగంగా మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, తైవాన్ స్ప్రేయర్లను అందజేస్తామన్నారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందిని సంప్రదించి, ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పథకాల కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నిరుద్యోగులకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు కళాశాలకు వస్తున్నారని జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వారు తెలిపారు. 9182920381 నంబర్‌కు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

పీఎస్ఓలకు శిక్షణ ప్రారంభం

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌లకు (గన్‌మెన్) ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తామని ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా తెలిపారు. డీటీసీలో శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. పీఎస్ఓలకు ఫిట్‌నెస్, ముందు జాగ్రత్తలు, ఆయుధ వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు జాఫర్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మీదుగా బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-గ్వాలియర్ మధ్య (వయా అనంతపురం) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును శాశ్వత ప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (11085) రైలు ఈ నెల 29 నుంచి ప్రతి ఆదివారం బెంగళూరులో మధ్యాహ్నం 3-50 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ఈ రైలు మంగళవారం ఉదయం 10-25 గంటలకు గ్వాలియర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (11086) జూలై 4 నుంచి ప్రతి శుక్రవారం నడుస్తుందన్నారు. ఈ రైలు గ్వాలియర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 7-35 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజాపేట్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, బేతుల్, భోపాల్, విదిషా, బీనా, అశోక్‌నగర్, గుణ, శివపురి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ఈ రైల్లో 2 ఏసీ టూటైర్, 4 ఏసీ త్రీటైర్, 3 ఏసీ త్రీటైర్ ఎకానమీ, 7 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకెండ్ క్లాస్, ఒక సెకెండ్ క్లాస్ లగేజ్ కం డిసేబుల్డ్ ఫ్రెండ్లీ కంపార్టుమెంట్, ఒక లగేజ్ కం జనరేటర్ కం బ్రేక్ వ్యాన్ కోచ్ ఉంటాయన్నారు.

యోగాంధ్ర విజేతకు ఎస్పీ ప్రశంసలు



చలపతిని అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర విజేతను ఎస్పీ జగదీష్ గురువారం ప్రశంసించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో విజేతగా నిలిచిన అనంతపురం డీటీసీ కానిస్టేబుల్ చలపతిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 17,18వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో యోగా శిక్షకులు చలపతి 2వ స్థానాన్ని సాధించారన్నారు. దేశ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇతర ప్రముఖులు పాల్గొన్న యోగాంధ్రలో సైతం ఆయన యోగాసనాలు సాధన చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. విజేతకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించి శాలువ కప్పి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. అనంతపురం పట్టణానికి చెందిన రోహిత్ సాయి, సుప్రీత దంపతులు. కాగా గురువారం ఉదయం వారు కల్లూరులోని స్టేట్ బ్యాంకుకు కారులో వచ్చారు. పని ముగించుకుని తిరిగి అనంతపురానికి వెళుతుండగా.. ఎదురుగా ఐషర్ వాహనం వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో రోహిత్‌సాయికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఐషర్ వాహనాన్ని ఆదుపులోకి తీసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడికి గ్రామస్థుల సన్మానం



సన్మానం చేసిన గ్రామస్థులు

శింగనమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇరువెంద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 8 ఏళ్లగా ఉత్తమ బోధన చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేసిన ఉపాధ్యాయుడు సాంబశివుడు ఇటీవల కల్లుమడికి బదిలీ అయ్యారు. దీంతో గ్రామస్థులు ఆయన్ను గురువారం పాఠశాలలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. అలాగే మరో ఉపాధ్యాయుడు రాజుని కూడా వారు సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గురువారం కూడా సమ్మె కొనసాగించారు. అందులో భాగంగా స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సప్తగిరిసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు ,నాయకులు సూర్యనారాయణ, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతుల పునరుద్ధరణ



ఆర్వో ప్లాంట్ నుంచి నీటిని పట్టుకుంటున్న దృశ్యం

అనంతపురం వైద్యం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వసతులు, సౌకర్యాలను పునరుద్ధరించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు సరిగా లేకపోవడంపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'సూపర్ వైద్యం.. పొందడమే కష్టం..!' అను శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆసుపత్రి ఉన్నతాధికారులు ఓపీ కౌంటర్‌లో వీల్ చైర్లు ఏర్పాటుచేశారు. ఓపీ చీటీకోసం నిరీక్షించకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అదేవిధంగా తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను రిపేరీ చేయించాయి. ఇలా అన్నిరకాల వసతులను పునరుద్ధరించాలమని అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

విజయసాయికి సర్వీస్ లెజెండ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయసాయికుమార్

అనంతపురం టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ సర్వీస్ లెజెండ్ అవార్డు అందుకున్నారు. కోలకత్తాకు చెందిన స్వామి వివేకానంద స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం వివిధ రంగాల్లో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న పలువురికి ఇటీవల సర్వీస్ లెజెండ్ అవార్డులను ప్రకటించింది. ఇందులో అనంతపురం నగరానికి చెందిన విజయసాయికుమార్‌ను ఎంపికయ్యారు. నగరంలోని మై భారత్ కేంద్ర ప్రభుత్వ కార్యాలయంలో గురువారం మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్ దాస్ విజయసాయికుమార్‌కు సర్వీస్ లెజెండ్ అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర డీడీఓ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రాహుల్ గిరిరెడ్డి, సాయి ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

అనంతపురంరూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవం మండలంలోని రాచానపల్లి యేసుకృపా మందిరంలో గురువారం ఘనంగా జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కర్ణాటక ఆర్చ్‌బిషప్ హొనసుర్, స్టీవెన్ సురేష్ ముఖ్యప్రసంగీకులుగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్‌చేశారు. తర్వాత ముఖ్యఅథితులను సత్కరించారు. కార్యక్రమంలో బెంగళూరు గాడ్స్ గ్రేస్ మినిస్ట్రీస్ ట్రస్ట్ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ ఐక్యవేదిక సమ్మేళనం

అనంతపురం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో ఈనెల 29న ఉదయం 10 గంటలకు బ్రాహ్మణ ఐక్యవేదిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షుడు లక్ష్మీనరసింహశాస్త్రి గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. బ్రాహ్మణులకు ఆర్థిక వనరులను చేకూర్చడం, వివాహాలకు సంబంధించిన విషయాలు, దేవాలయాలలో బ్రాహ్మణులకు జరుగుతున్న అన్యాయాలు తదితరవాటిపై చర్చించడం జరుగుతుందన్నారు. కాబట్టి జిల్లాలోని బ్రాహ్మణులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి

- ఎమ్మెల్యే పరిటాల సునీత
- స్వయం సహాయక సభ్యులకు రూ.4.38 కోట్ల స్త్రీనిధి రుణాల చెక్కుల పంపిణీ



స్త్రీనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండల కేంద్రంలో గురువారం డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో స్వయం సహాయక సభ్యులకు స్త్రీనిధి రుణాల పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అందుకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 441 మందికి రూ.4.38కోట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి రుణాలను ప్రతి ఒక్క సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో మహిళలు కుటుంబ అవసరాల కోసం ఇంటి యజమానులపై ఆధారపడే వారని, ప్రస్తుతం వారే ఆర్థికాభివృద్ధి సాధించేస్థాయికి వచ్చారని అన్నారు. మహిళలు ఆ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన తోడ్పాటే కారణమన్నారు. డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి మహిళలకు రుణాలు ఇప్పించడం వల్ల స్వయం ఉపాధి సాధిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం స్త్రీనిధి రుణాలు పొందిన మహిళలు ఏదైనా వ్యాపారాలకు, స్వయం ఉపాధికి వెచ్చించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే తీసుకున్న రుణాన్ని తిరిగి సక్రమంగా చెల్లించాలని తెలిపారు. అర్హత ఉన్నా తల్లికి వందనం రాని వారికి అందుకు గల కారణాలను తెలుసుకుని అందేలా చూస్తామని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. స్త్రీనిధి డీజీఎం వెంకటప్రకాశ్, డీపీఎం సత్యనారాయణ, ఏజీఎం హుకునేస్‌బాబు, ఏపీఎం నాగేంద్ర, ఎంపీడీఓ బాలకృష్ణుడు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, మండలసమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మమ్మ, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, వెలుగుసిబ్బంది, డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీలో ఎమ్మెల్యే ..

చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రంలో జీవాలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. పలు జీవాలకు మందును వేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో గొర్రెలు, మేకలకు దాదాపు రూ.20 లక్షల విలువైన రూ.3.50 లక్షల నట్టల నివారణల మందులను రైతు సేవా కేంద్రాలద్వారా పంపిణీ చేస్తున్నట్టుతెలిపా రు. గొర్రెలు, మేకల పెంపకం దారులు వినియోగించుకోవాలని సూచించారు.

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



కామారుపల్లిలో వృద్ధురాలికి ఇంటి వద్దే రేషన్ బియ్యం అందజేస్తున్న కలెక్టర్



గార్లదిన్నెలో జేసీ శివనారాయణ శర్మ..

అనంతపురం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. కామారుపల్లిలో గురువారం చేపట్టిన రేషన్ పంపిణీని ఆయన పరిశీలించారు. ఓ వృద్ధురాలికి ఇంటి వద్దే రేషన్ బియ్యాన్ని అందజేశారు. గ్రామానికి వచ్చే 2.5కిలో మీటర్ల రోడ్డును రూ.16లక్షల డీఎంఎఫ్ ఫండ్స్‌తో మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ మోహన్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ఐడీ కార్డులు వేసుకోవడం లేదని, వాటిని ధరించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీలర్ యమున, వీఆర్వో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●గార్లదిన్నె: వృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులను ఇంటివద్దే అందించాలని జా యింట్ కలెక్టర్ శివ నా రాయణ శర్మ డీలర్లకు సూచించారు. మండలంలోని తిమ్మంపేట గ్రా మంలో లోకాయుక్తలో ఉన్న భూమిని ఆయన ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ బండారు ఈరమ్మతో కలిసి పరిశీలించారు. భూ సమస్యపై సంబంధిత రైతులతో మాట్లాడారు. అనంతరం గార్లదిన్నెలోని రేషన్ షాపు-2ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్యా మల, వీఆర్వో రవిశంకర్, విలేజ్ సర్వేయర్ బాబా పాల్గొన్నారు.

●శింగనమల మండలం పెరవలిలో వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు తహసీల్దార్ శేషారెడ్డి పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, సీఎస్‌జీటీ చంద్రకళ, ఆర్ఐ బషీరున్నీబేగం, టీడీపీ నాయకుడు మారుతీనాయుడు, నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్ ఎం.ఆదినాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన డీటీసీ సీఐ పవన్ కుమార్ మృతదేహానికి గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పవన్ కుమార్ 1996లో ఎస్ఐగా చేశారు. ఇటీవలి వరకూ సీఐగా అనంతపురంలోని డీటీసీలో పని చేశారు. గత కొంతకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయనకు భార్య పుష్పవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సీఐ మృతి పట్ల ఎస్పీ జగదీష్ సంతాపం తెలిపారు. బంధువులు, స్నేహితుల సందర్శనార్థం మృతదేహాన్ని ద్వారకా విల్లాస్‌లో ఉంచిన తర్వాత పిల్లిగుండ్ల కాలనీలోని శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐలు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి పోస్టర్ల ఆవిష్కరణ

అనంతపురం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మూడో రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో జూలై 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 8న సాయి సచ్చరిత్ర పారాయణం, 9న అఖండ సాయినామ సంకీర్తన, 10న గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మొదలైన వారాహి నవరాత్రులు

అనంతపురం టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆషాడ శుద్ధ పాడ్యమి సందర్భంగా గురువారం నగరంలోని పలు ఆలయాల్లో వారాహి నవరాత్రులు ఘనంగా మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో సోమనాథ్‌నగర్ కోదండ రామాలయంలో వారాహి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యాలయ మేనేజర్

అనంతపురం అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయ మేనేజర్‌గా సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు మేనేజర్‌గా ఉన్న మంజుల విశాఖపట్నంకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో అక్కడ పనిచేస్తున్న సౌజన్యను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, ఇతర అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- పోలీస్‌స్టేషన్ వద్ద హిజ్రాల ఆందోళన

బుక్కరాయసముద్రం, జూన్‌26: మండలంలోని కేకే ఆగ్రహారం గ్రామంలో హిజ్రా కుటుంబంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని గురువారం రాత్రి మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద హిజ్రాలు ఆందోళన చేపట్టారు. దాదాపు గంట పాటు 200 మందిపైగా హిజ్రాలు నిరసన తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్లితే... కేకేఆగ్రహారంలో ఈనెల 24న మంగళవారం రాత్రి హరిజన పెద్దన్న, నల్లప్పల మధ్య వివాదం జరిగింది. ఇందులో పెద్దన్నపై నల్లప్ప, అతడి భార్య కుళ్లాయమ్మ కట్టెతో దాడి చేశారు. గాయపడిన పెద్దన్న కర్నూలు ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. కాగా గురువారం పెద్దన్న కుటుంబానికి చెందిన హిజ్రా రాణి తోటి హిజ్రాలతో కలిసి గ్రామానికి వెళ్లి అక్కడ నల్లప్ప కుటుంబ సభ్యులతో ఎందుకు దాడి చేశారని ప్రశ్నించారు. ఆ సమయంలో హిజ్రాలపై స్థానిక ప్రజలు తిరగబడ్డారు. ఈ విషయంపై పోలీసులు తగు న్యాయం చేయలేదని అనంతపురం జిల్లా హిజ్రా యూనియన్ సభ్యులకు రాణి సమాచారం ఇచ్చింది. దీంతో 200 మందిపైగా స్టేషన్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. వెంటనే నల్లప్ప, అతడి కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇటుకలపల్లి, శింగనమల సీఐలతో పాటు పలువురు ఎస్ఐలు అక్కడికి చేరుకున్నారు. న్యాయం చేస్తామని హిజ్రాలకు డీఎస్పీ హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కొంత మంది హిజ్రాలు స్టేషన్‌లో ఫర్నీచర్ కిందికి వేయడంతో పోలీసులు ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

యువత డ్రగ్స్ జోలికి వెళ్లరాదు

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ

చెన్నేకొత్తపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లరాదని, వాటికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకోరాదని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు స్థానిక మహిళలు, విద్యార్థులతో కలిసి పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాహకం వల్లనే రాష్ట్రంలోకి గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాల జోలికి వెళితే జరిగే నష్టాల గురించి వివరించారు. వాటి జోలికి వెళ్లరాదని తెలిపారు. సమావేశంలో రామగిరి సీఐ శ్రీధర్, సీకేపల్లి, కనగానపల్లి ఎస్ఐలు సత్యనారాయణ, మహ్మద్ రిజ్వాన్, ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసూన్ కుమార్‌నాయుడు, ఎంపీడీఓ బాలకృష్ణుడు, హెచ్‌ఎం ఓబుళమ్మ, స్కూల్‌కమిటీ చైర్మన్ హరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●రాప్తాడు: మండలకేంద్రంలో పోలీసులు, మండల అధికారులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద నుంచి బస్టాండు వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, రాప్తాడు సీఐ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు అమ్మినా, వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక అధికారి రామ్మోహన్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, సర్పంచ్ తిరుపాలు, ఫీల్డ్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

● గార్లదిన్నె: మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా అవగాహన కల్పించారు. వాటి జోలికి ఎవరూ వెళ్లరాదని సూచించారు. మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎంఈఓ తారా చంద్రా నాయక్, హెచ్‌ఎం సుంకన్న, ఇంచార్జ్ ఎంపీడీఓ బాబాఫక్రుద్దీన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

●శింగనమల: మండలకేంద్రంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సీఐ కౌలుట్లయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర అధికారులు కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఇందులో డ్రగ్స్‌కు నో చెప్పండి, ప్రాణాలను కాపాడుకోండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద మనహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్, ఎంఈఓ నరసింహరాజు, ఏపీఎం ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ కల్పన నేతాజీ, ఏఎస్ఐ చితంబరయ్య తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి ఎస్ఐ లక్ష్మణరావు, తహసీల్దార్ లక్ష్మీనాయక్ మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం పార్వతీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీకేపల్లి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, డీఎస్పీ హేమంత్‌కుమార్ తదితరులు



రాప్తాడులో ర్యాలీ చేస్తున్న రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ శ్రీహర్ష, ఇతర అధికారులు

పన్నాగంపై కలెక్టర్ సీరియస్

- నగరపాలక సంస్థ రెవెన్యూలో మాయాజాలంపై ఆరా

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో మాయాజాలంపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన పన్నాగం...! అనే కథనానికి ఆయన స్పందించారు. అసలు నగరపాలక సంస్థలో ఏమి జరుగుతోంది.. రెవెన్యూ విభాగంలో ఏంటి ఈ పరిస్థితి.. అంటూ కమిషనర్ బాలస్వామిని అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాలకు పన్ను (వీఎల్‌టీ) వసూలు చేయకుండా రెవెన్యూ విభాగం అధికారులు ముడుపులతో సరిపెడుతున్న అంశంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థలో ఇలాంటి పరిస్థితి నెలకొనడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోపణలు ఉన్న అధికారులపై తనకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇచ్చేందుకు కమిషనర్ కసరత్తు చేస్తున్నారు.

ఆ సినిమాను బ్యాన్ చేసేలా చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతీసేలా చిత్రీకరించిన 8 వసంతాలు సినిమాను తక్షణమే బ్యాన్ చేసేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ కోరారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన సంఘం నాయకులతో కలిసి ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. డైరెక్టర్ ఫణీంద్ర నరశెట్టి చిత్రీకరించిన 8 వసంతాలు సినిమాలో కాశీలాంటి పవిత్ర పుణ్య స్థలంలో ఫైట్, రేప్ సీన్లు తీయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ సీన్లను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ సినిమా నిర్మాతలు, డైరెక్టర్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రఘువేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శర్మ, కార్యనిర్వాహణ అధికారి కొనకంచి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పారిశుధ్య మహిళా కార్మికులకు దుస్తుల పంపిణీ

అనంతపురం వైద్యం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్య మహిళా కార్మికులకు పసుపు, కుంకుమ పేరుతో గురువారం ఒక్కొక్కరికి ఒకజత దుస్తులను, తాంబూళాలను పంపిణీచేశారు. నిత్యసురభి వ్యవస్థాపకురాలు డాక్టర్ నిర్మలా మురళీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత ముఖ్య అతిథిగా హాజరై వాటిని పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 50 మంది మహిళలకు సొంత ఖర్చుతో డాక్టర్ మురళీ నిర్మలా పంపిణీ చేయడం అభినందనీమన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 నాగమణి, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

- పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే పశుసంవర్ధక సహాయకుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని పశుసవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలు పూర్తి చేస్తామన్నారు. బదిలీల్లో ఎలాంటి అవకతవకలు, అవినీతికి తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని చదువు కోసం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆదేశాల మేరకు ఆర్థిక సాయం అందించినట్టు టీడీపీ నేతలు పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన టీడీపీ సానుభూతి పరుడు రవి కుమార్తె సాయి ప్రియ చదువు కోసం గురువారం జిల్లా సర్వజనాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్ చేతుల మీదుగా టీడీపీ నేత ఓంకార్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ బాలికకు భవిష్యత్తులో చదువుకు సంబంధించి ఏ సహాయం కావాలన్నా...తాము ఉంటామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. నాయకులు తాటి మధు, ఇస్మాయిల్, వాల్మీకి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకోవడమే లక్ష్యం

అనంతపురం వైద్యం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీని కాపాడుకోవడమే మన లక్ష్యం కావాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆర్డీటీ పర్యవేక్షణ జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఆ జేఏసీ కన్వీనర్‌గా సాకేహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆర్డీటీని కాపాడుకోవాల్సిన అంశాలపై చర్చించారు. వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు చామలూరు రాజగోపాల్, ఆనంద్‌రాజు, రామకృష్ణ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులతో గ్రామస్థులు, విద్యార్థులు

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి క్రాస్ ప్రభుత ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు రామలింగదేవి, ఉపాధ్యాయురాలు సుప్రజకు గురువారం గ్రామస్థులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. రామలింగదేవి మాట్లాడుతూ... మొత్తం 18 సంవత్సరాలు ఇక్కడే పని చేయడంతో దేవిగిరి క్రాస్ తనకు పుట్టినిల్లుగా మారిందన్నారు. ఎంఈఓలు వీరన్న, మల్లికార్జున మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లితే ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానం చేయడం సర్వసాదారణమని, అయితే గ్రామస్థులు ఇలా సన్మానం చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లీడు శీన, రేవణ్ణ, విజయలక్ష్మి, అడ్వకేట్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు నాగేంద్ర, ఆర్పీలు అమరేష్, రామాంజనేయులు, మంజప్ప పాల్గొన్నారు.

కార్మికుల దీక్షకు సంఘీభావం

గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన దీక్షలకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్ పర్సన్ నైరుతి రెడ్డి, కౌన్సిలర్లు ఆర్ పవన్‌కుమార్ గౌడ్ గురువారం సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

పెన్షనర్ల సంఘానికి రూ.10 వేలు విరాళం

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక టీచర్స్‌కాలనీలోని పెన్షనర్ల సంఘానికి స్థానిక బీసీ హాస్టల్ విశ్రాంత వార్డెన్ క్రిష్టయ్య రూ. 10 వేలను విరాళంగా గురువారం ఇచ్చారు. సంఘం తరఫున చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడైన ఈ విరాళాన్ని ఆయన అందజేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రైతులకు వ్యవసాయ డ్రోన్ అందజేత

గుత్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపల్లి వ్యవసాయ గ్రూప్ సభ్యులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో మంజూరు చేసిన వ్యవసాయ డ్రోన్‌ను స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్ద ఏడీఏ వెంకటరాముడు గురువారం అందజేశారు. మిగిలిన గ్రామాల సభ్యులకూ మూడు రోజుల్లో అందజేస్తామన్నారు.

ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

మున్సిపల్ సాధారణ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్ కృపాకర్

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అభివృద్ధి పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షతన గురువారం గుంతకల్లు పురపాలక సంఘ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ కౌన్సిలర్లు కే కృపాకర్, పవన్‌కుమార్ గౌడు మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇంజనీరింగ్ శాఖ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, పట్టణంలో కనీసం రెండు రోజులకోసారైనా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ నయ్యాం అహ్మద్, కౌన్సిలర్లు అనూరాధ, గుడిపాటి ఆంజనేయులు, విద్యారాణి, నాగరత్న పాల్గొన్నారు.

సహకార బ్యాంక్ తనిఖీ

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సొసైటీ బ్యాంక్‌ను జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి గురువారం తనిఖీ నిర్వహించారు. బ్యాంక్ టర్నోవర్, రుణాలు తదితర అంశాలపై ఆరాతీశారు. ఇందులో సీఈఓ సురేఖవాణి, చీఫ్‌మేనేజర్ అనంత పద్మనాభం పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



క్రీడాకారుల తరఫున బహుమతిని అందుకుంటున్న కోచ్

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖాండ్ రాష్ట్రం హరిద్వార్‌లో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్, జూనియర్ క్యోరూగి, పూంసే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో తాడిపత్రికి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించారని కోచ్ సాయిబాబా గురువారం తెలిపారు. క్యోరూగి విభాగంలో యోగ చర్విత, జినిత్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీ భవిష్య, దేవాన్ష్‌రెడ్డి, శ్రీనివాస్‌కల్యాణ్, పూంసే విభాగంలో నివేద్, ఉమామహేష్, నితీష్ ప్రతిభ చాటారన్నారు. ఆ క్రీడాకారులను, కోచ్‌ను స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివయ్య, నరేష్, రామాంజి అభినందించారు.

అరకొరగా 'రైతు సేవ'లు

ఇబ్బందుల్లో అన్నదాతలు



కుందుర్పిలోని రైతు సేవా కేంద్రం

కుందుర్పి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డి, మహంతపురం, అపిలేపల్లి, నిజవల్లి, కుందుర్పిల్లో రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు రెండు నెలల క్రితం ఉద్యోగోన్నతులపై ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో కొత్తవారిని నియమించలేదు. దీంతో ఏఈఓ వారానికి ఒకసారి మాత్రమే వస్తుండటంతో రైతులకు అరకొర సేవలు అందుతున్నాయి. అన్నదాత సుఖీభవ పథకం ఈకేవైసీ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి



బొమ్మనహాళ్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

బొమ్మనహాళ్, జూన్, 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామ శివారులోను తాగునీటి ట్యాంకు చుట్టూ ఉన్న భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ పల్లి తిప్పేస్వామి, గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు తహసీల్దార్ మునివేలు, పోలీసులకు ఫిర్యాదు చేసిన వారు మాట్లాడారు. ట్యాంక్ సమీపంలోని స్థలాన్ని తిమ్మప్ప అనే వ్యక్తి కబ్జా చేశాడని, అలాగే గ్రామంలో పీర్ల అగ్నిగుండం స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అలివేలు శ్రీనివాసులు, గొల్ల రామకృష్ణ, చంద్ర, దివాకర్ ఉన్నారు.

● రాయదుర్గంరూరల్ : కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, నదులు అన్నిటినీ కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీసీవై పార్టీ తాలూకా అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణ సమీపంలోని కొండ పోరంబోకు స్థలాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. కబ్జాదారులు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలోని గౌడ లేఅవుట్ వద్ద కొండ పోరంబోకు స్థలాన్ని సైతం కబ్జా చేశారన్నారు.

భూములను పరిశీలించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

పుట్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురంలో గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విషన్) మల్లికార్జునుడు పర్యటించారు. గ్రామంలో 544-డీ జాతీయ రహదారికి పోయిన భూములను పరిశీలించారు. పరిహారం వచ్చిందా లేదా అని భూములు కోల్పోయిన రైతుల వద్ద ఆరాతీశారు. సమస్యలుంటే ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రవీంద్ర

ఉరవకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రవీంద్రకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు కర్నూల్ ఐటీఐ కళాశాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో తాడిపత్రి వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్‌ను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు.

రోటరీ క్లబ్ పాలకవర్గం ఏర్పాటు

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన రోటరీ క్లబ్ సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ప్రకటించారు. క్లబ్ అధ్యక్షుడిగా యా సుధీర్ కార్వా, కార్యదర్శిగా కే రవికుమార్, ఉపాధ్యక్షుడిగా బీ రామాంజనేయులు, కోశాధికారిగా జీ శ్రీనివాసులు నియమితులయ్యారు. కార్యక్రమంలో శివానంద, బీ శిరీశ్ కుమార్, వక్కల ఉమ, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గుత్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శంకర్ నేత్రాలయం సమక్షంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 54 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఇందులో లయన్స్ క్లబ్ ఎంఎల్ఎఫ్ విరూపాక్ష రెడ్డి, సభ్యులు, రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ పాల్గొన్నారు.

స్వామి సహజానంద సరస్వతికి ఘన నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, క్విట్ ఇండియా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన స్వామి సహజానంద సరస్వతి వర్ధంతిని స్థానిక నెహ్రూపార్కు వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రంగయ్య, ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, ఓబిరెడ్డి, శ్రీరాములు, రమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఇదే పరిస్థితి

రోడ్డుపైకి మురుగునీరు



మ్యాన్ హోల్ నుంచి వస్తున్న మురుగునీరు

కంబదూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మ దేవాలయం వద్ద ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించిన మ్యాన్ హోల్ నుంచి మురుగునీరు రెండేళ్ల నుంచి బయటకు వచ్చి.. రోడ్డుపై పారుతోంది. అయినా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తీవ్ర దుర్వాసన వస్తుండటంతో ఆ ప్రాంతవాసులు, మారెమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఓనర్ల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఆయిల్ ట్యాంకర్ల ఓనర్లు

గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్స్ కాంట్రాక్టర్స్ ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు గురువారం వినతి పత్రం అందజేశారు. గుంతకల్లులోని హెచ్‌పీసీ డిపోను కడపకు తరలించారని, కడపలో కొత్తగా ట్రాన్స్‌పోర్ట్‌కు టెండర్లను పిలిచారని అన్నారు. ఈ టెండర్లలో తమతో పాటు తమిళనాడు వాళ్లు కూడా పాల్గొంటున్నారని, వారికి టెండర్లు దక్కితే దీనిపై ఆధారపడిన తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని వాపోయారు. ఈ టెండర్లలో మొదట స్థానికులకే ప్రాధాన్యం ఇచ్చేలా హెచ్‌పీపీ అధికారులతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందులో హెచ్‌పీసీఎల్ ట్రాన్స్ పోర్టర్స్ కాంట్రాక్టర్స్ ఆయిల్ ట్యాంకర్స్ ఓనర్లు ఎన్ రామాంజినేయులు, లారీ రమేష్, శివ, ఎర్రిస్వామి, బీమలింగ పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కుందుర్పి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమపై పని ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు మండల అభివృద్ధి అధికారి లక్ష్మీశంకర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత షెడ్ల నిర్వహణలో శానిటేషన్‌లో ఉదయం 7 గంటలలోగా హాజరు కావాలని, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వేలకు ప్రతి డిపార్ట్‌మెంట్‌లో తమను బాధ్యులుగా చేస్తూ మెమోలు, సస్పెన్షన్ చేస్తున్నారని వాపోయారు. కేవలం మాతృశాఖకు సంబంధించిన కార్యక్రమాలు మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆనంద్, రాఘవ, రామాంజినేయులు హరీష్, నవీన్ ఓబుళపతి రాఘవేంద్ర పాల్గొన్నారు.

30వరకు భూముల సబ్‌డివిజన్ డ్రైవ్

రైతులూ.. సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

యాడికి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో ఈనెల 30వరకు సబ్ డివిజన్ డ్రైవ్ ఉంటుందని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ పట్టాదారులుగా ఉన్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, దీంతో ఈ ఇబ్బందులను తొలగించడానికి ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమస్య ఉన్న రైతులు దరఖాస్తు రుసుం రూ.50 సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్‌కు చెల్లించాలని, జాయింట్ పట్టాదారులకు ఉచితంగానే సబ్ డివిజన్ చేస్తారని తెలిపారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో రీసర్వే డిప్యూటి తహసీల్దార్ విజయ్‌కుమార్, మండల సర్వేయర్ శేషసాయి పాల్గొన్నారు.

ఇంటి వద్దకే బియ్యం

గుత్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ పుణ్యవతి గురువారం చేపట్టారు. ఇందులో ఆర్ఐ హనుమాన్‌ప్రసాద్, వీఆర్వో చంద్రకళ, డీలర్లు పాల్గొన్నారు.

● బెళుగుప్ప : వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దకే డీలర్లు వెళ్లి బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎరువుల వాడకంలో జాగ్రత్త

మండల వ్యవసాయాధికారి వాసుకి రాణి



ఇంటర్వ్యూ

శెట్టూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పంటలకు ఎరువుల వాడకంలో రైతులు చాలా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వాసుకి రాణి సూచించారు. ప్రతి రైతూ తప్పకుండా భూసార పరీక్షలు చేయించాలని, అనంతరం ఎంత మేర ఎరువులు అవసరమో అధికారుల సూచన మేరకు అంతే వాడాలని అన్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడరాదన్నారు. గురువారం ఆమెతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న : ఎరువుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.?

జవాబు : ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన దుకాణాల్లోనే ఎరువులు, మందులు కొనాలి. కొన్న వాటికి తప్పకుండా రసీదు తీసుకోవాలి. అప్పుడే ఏదైనా నష్టం జరిగినప్పుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుంది.

ప్రశ్న : విత్తన వేరుశనగ పంపిణీ ఎలా జరుగుతోంది.?

జవాబు : మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను రైతులకు అందజేస్తున్నాం. కే 6 రకం 2500 క్వింటాళ్లు, టీసీజీఎస్ రకం 300 క్వింటాళ్లు మండలానికి మంజూరయ్యాయి. రైతులకు అందజేస్తున్నాం.

ప్రశ్న : సాగు సమయంలో తీసుకోవాల్సిన చర్యలు

జవాబు : ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు రైతులు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలి. అనంతరం పంటకు ఏమైనా తెగుళ్లు వస్తే వెంటనే రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలి.

ప్రశ్న : అన్నదాత సుఖీభవ గురించి...

జవాబు : మండలంలోని 16 గ్రామ పంచాయతీలోని 8,781 మంది రైతులకు ఈ పథకం వర్తించింది. ఇంకా మండలంలో 257 మంది నమోదు కాని, అనర్హ రైతులు ఉన్నారు.

క్రైం న్యూస్ ..

లారీ డ్రైవర్‌కు గాయాలు

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బందార్లపల్లి గ్రామ సమీపంలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో.. ఓ లారీ డ్రైవర్, లాథూర్ జిల్లా వాసి బాబురావు కాలు విరిగింది. పుత్తూరు నుంచి నాసిక్‌కు మామిడిపండ్ల లోడుతో ఈ లారీ వెళుతుండగా.. ఓ లారీని ఓవర్ టేక్ చేయబోయి.. ఎదురుగా వచ్చిన మరో లారీని ఢీకొన్నాడు. గాయపడిన అతన్ని స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్కాబీటర్ అరెస్ట్

యాడికి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అతని నుంచి రూ.3,150, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

యల్లనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి నదిలో ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను గురువారం సాయంత్రం సీజ్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. దాన్ని స్టేషన్‌కు తరలించామన్నారు. కాగా, పోలీసులు ట్రాక్టర్లను వదిలేసి.. ఎక్స్‌కవేటర్‌ను మాత్రమే సీజ్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

విధుల్లోకి తీసుకోవాలని రైల్వే ఉద్యోగి ధర్నా



దీక్ష చేస్తున్న విజయ్ బహదూర్ పాథక్

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అనవసరంగా విధుల నుంచి తొలగించిన తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లోకో పైలెట్ విజయ్ బహదూర్ పాథక్ స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఎదుట గురువారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. కొందరు లోకో పైలెట్లు పని చేయకుండా హెడ్ క్వార్టర్సులో వేరే పనులకు విధులను వేయించుకుంటున్నారని, దీంతో మిగిలిన లోకో పైలెట్లపై పనిభారం పెరిగిందని, దీన్ని ప్రశ్నించినందుకు తనపై అధికారులు కక్షకట్టారని వాపోయారు. చిన్నచిన్న కారణాలు చెప్పి రెండుసార్లు తనపై సస్పెన్షన్‌ను విధించారని, సంవత్సరం కిందట తనను ఉద్యోగంలో నుంచి తొలగించారని అన్నారు.

హంద్రీనీవా నీటితో రిజర్వాయర్ నింపాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం రిజర్వాయర్‌ను హంద్రీనీవా నీటితో నింపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ రిజర్వాయర్‌ను పరిశీలించిన వారు మాట్లాడారు. గతంలో జీబీసీ కాలువ ద్వారా తుంగభద్ర జలాలు పంపింగ్ చేసి ఈ రిజర్వాయర్‌ను నింపేవారని, కసాపురం, దోసులుడికి, సంగాల గ్రామాలకు తాగునీటి కోసం ఆ నీటిని వినియోగించేవారని అన్నారు. తంగభద్ర జలాలు ఆగిపోవడంతో రిజర్వాయర్ ఎండిపోయిందన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఈ రిజర్వాయర్‌ను హంద్రీనీవా నీటితో నీటితో నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల సంచారం

రాయదుర్గం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లి గ్రామ సమీపంలోని కొండగుట్టలో వారం రోజులుగా ఎలుగుబంట్లు సంచరిస్తుండటంతో ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ హైస్కూల్ వద్ద మూడు ఎలుగుబంట్లు ప్రధాన రహదారిని దాటుకుని కొండ గుట్టల్లోకి వెళ్లాయన్నారు. ఆ గ్రామంలోని ప్రజలు, రైతులు, పశువులు, గొర్రెల కాపరులు పొలాల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వాటిని దూరంగా తరలించేలా అటవీఅధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవకతవకలపై విచారణ

కుందుర్పి, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అపిలేపల్లిలోని ఆంజనేయ స్వామి రైతు పరస్పర సహకార సంఘంలో జరిగిన అవకతవకలపై సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి నాగభూషణ్ రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. అపిలేపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతు పరస్పర సహకార సంఘం అధ్యక్షులు బీఓడీ సభ్యులు, గ్రామస్థులతో అవకతవకలపై ఆరా తీశారు. 30 రోజుల్లో అవకతవకలు, సర్దుబాటు చేసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ సంఘంలో అవకతవకలు జరిగాయని రైతు లేపాక్షి జిల్లా కేంద్రంలోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో అవినీతిపై ...

తాడిపత్రి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్‌కాలనీలో ఉన్న 1వ అంగన్‌వాడీ సెంటర్‌లో గుడ్లు సరిగా పంపిణీ చేయకుండా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై జిల్లా అధికారులతో పాటు సీడీపీఓ సాహిదాబేగం గురువారం విచారణ చేపట్టారు. ఈ అవినీతిపై అనంతపురం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో పలువురు ఫిర్యాదు చేయడంతో.. ఈ విచారణ చేపట్టారు. కొన్ని గుడ్లను కిరాణాషాపుల్లో అమ్మినట్లు ఆరోపణలు ఉన్నాయి.

దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పుట్లూరు, ఏ. కొండాపురం గ్రామాల ఆశా కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తులను ఈనెల 30లోగా మండల కేంద్రంలోని ఆసుపత్రిలో అందజేయాలని మండల వైద్యాధికారులు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులన్నారు.



గుంతకల్లులో..



ఉరవకొండలో..

డ్రగ్స్‌తో అనర్థాలపై ర్యాలీ

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై పలు ప్రాంతాల్లో గురువారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గుంతకల్లులో డీఎస్పీ శ్రీనివాసులు, తాడిపత్రిలో అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్, ఉరవకొండలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, జూనియర్ సివిల్ న్యాయాధికారి దుర్గా కల్యాణి, రాయదుర్గంలో ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్, సివిల్ ఎస్ఐ ప్రసాద్‌బాబు, కళ్యాణదుర్గంలో ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.



రాయదుర్గంలో..



తాడిపత్రిలో..



కళ్యాణదుర్గంలో..